

'ఇంపాజిబుల్' అన్నాడు ప్రసాద్.

వాడి ధైర్యమేంటో నాకర్థం కాలేదు.

'అయితే ఛాలంజ్' అన్నాను.

'ఛాలంజ్! ఎంత'? అడిగాడు ప్రసాద్.

'రెండువేలు' అన్నాను...

'నేనురెడీ' అన్నాడు.

''నువ్వింతకు ముందు ఎన్నిసార్లు రైడింగుల్లో పట్టుబడ్డావో నా కనవసరం. ఈసారి నువ్వు ఏ లాడ్జిలో, ఏ రూమ్‌లో, ఏ అమ్మాయితో దిగుతావో ముందుగా చెప్పు. పోలీసులకు నేనే ఫోన్ చేసి ఆ లాడ్జిలో 'వ్యభిచారం జరుగుతున్నదని' చెబుతా. నేను కూడ అక్కడికి ఏదో ఒక పనున్నట్టుగా వచ్చి నువ్వు పట్టుబడడం చూస్తా'' అన్నాను.

''ఒరేయ్ గిరీ, పగటి కలలు కనొద్దు. నువ్వన్నట్టు నేనెప్పుడూ పోలీస్ రైడింగ్‌లో పట్టుబడలా. ఇక పడనుకూడా. మీకు దొరకని అదృష్టం నాకు దొరుకుతున్నదని మీకు అసూయ'' అన్నాడు ప్రసాద్.

'సరే, నీ ఇష్టం ఏమైనా అనుకో. కాని, ఇప్పుడున్న ఎస్.ఐ. చాలా స్ట్రిక్ట్. పట్టుకుంటే పరువుపోతుంది. ముందే ఆలోచించుకో' అన్నాను. వాడు 'ససేమిరా' అన్నాడు.

మర్నాడే ప్రసాద్ చెప్పాడు 'స్వర్గం' లాడ్జికి విమలతో వెళుతున్నానని. రూం నెంబరు వివరాలు అన్నీ చెప్పాడు. నేను ఎస్.ఐ. శ్రీనాథ్‌కి ఫోన్ చేసి 'స్వర్గం లాడ్జిలో వ్యభిచారం సాగుతుంది. ఈ రాత్రికే రైడ్ చెయ్యమని' చెప్పాను నా పేరు చెప్పకుండా.

చీకటి పడగానే బయల్దేరి లాడ్జి ఎదురుగానే పదిన్నర దాకా పనున్నట్టుగా అటు ఇటూ తిరుగుతూ కాలక్షేపం చేశాను. అప్పుడే వచ్చింది పోలీసు పార్టీ. హడావుడిగా పోలీసులంతా లోపలికి పరుగెత్తి గది గదికి వెళ్ళి చెక్ చేస్తున్నారు. నేను మెల్లిగా లాడ్జి ఆవరణలోకి ప్రవేశించాను. ఇన్‌స్పెక్టర్ నిలబడి వున్న రూమ్ వైపు నడిచాను. సరిగ్గా అదే ప్రసాద్ చెప్పిన రూమ్. ఎస్.ఐ. తలుపు తట్టాడు. లోపల్నుంచి 'వన్ మినిట్' అని వినిపించింది. రెండు నిమిషాల్లోనే తలుపు తెరుచుకుంది.

నేను కొద్ది దూరంలో వుండి చూస్తున్నాను. తలుపు పక్కగా ప్రసాద్ నిలబడివున్నాడు. నాకా క్షణంలో జాలేసింది. ''కొంపదీసి వీడు జోక్‌గా తీసుకొని నాతో చెప్పలేదు గదా! అనవసరంగా చిక్కుల్లో పెట్టానేమో!'' అనుకున్నాను.

'ఎవరామె?' అడుగుతున్నాడు ఎస్.ఐ.

'నా భార్య' అన్నాడు ప్రసాద్.

వాడి ధైర్యానికి నాకు ఆశ్చర్యం వేసింది.

ఎస్.ఐ. మాటలకు మెలుకువ వచ్చినట్టుగా బెడ్ మీద ఒక పక్కకు వత్తిగిలి అప్పటి దాకా పడుకున్న 'ఆమె' కూడ ప్రసాద్‌కి వెనగ్గా వచ్చి నిలబడింది.


నేను ఇంకా కొద్దిగా ముందుకు వెళ్ళాను.

ఎస్.ఐ. ఒక్కసారి ఆమె వైపు చూసి 'అయామ్ సారీ మిస్టర్. మిమ్మల్ని డిస్టర్బ్ చేశాను వెరి వెరి సారీ' అన్నాడు.

'ఇట్సాల్‌రైట్' ప్రసాద్ అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. జరిగిందేమిటో భోధపడలేదు. వాణ్ణి ఎందుకు పట్టుకోలేదు! వెంటనే తలుపు దగ్గరగా వచ్చి తొంగి చూశాను. నిండు గర్భిణి కన్పించింది. నైటీ వేసుకొని వుంది. పరీక్షగా ఆమె ముఖం చూశాను. విమల! అంతలోనే దభాలున తలుపేసుకున్నాడు ప్రసాద్.

అరె. విమలను రోజు చూస్తున్నాను, ఉదయం కూడ చూశాను మామూలుగానే వుంది. ఇప్పుడు మరి ఈ గర్భం......! వెంటనే విషయం అర్థమైపోయింది. ఓహో ఇదన్నమాట వీడి చిదంబర రహస్యం. పోలీసులు రాగానే ఆమెను గర్భిణీగా మారుస్తున్నాడు. రహస్యం కనుక్కో గలిగినందుకు సంతోషం కలిగింది. అయితే వెంటనే పందెం కట్టిన విషయం గుర్తొచ్చి నీరసంగా కూలబడి పోయాను.



యస్.వి.సుబ్బయ్య